# దొంగ-దొర



- విశ్వమోహిని

శ్రీరాం బీకాం పాసయి అయిదేళ్ళయింది. సబ్జెక్ట్ అయినా మరిచిపోయాడుగాని, జాబ్ మాత్రం దొరకలేదు అతనికి. ఎన్నెన్నో ప్రయత్నాలు చేసి విసుగెత్తిపోయాడు. తనకు డిగ్రీ ఇచ్చిన యూనివర్సిటీమీద విసుక్కున్నాడు. ఆ డిగ్రీ విలువను గుర్తించని ప్రభుత్వంమీద కినుక వహించాడు.

పరిస్థితి పస్తులవరకు వచ్చేసరికి పిచ్చెక్కిపోయింది అతనికి. కాలే కడుపుకు పట్టెడు మెతుకులు పెట్టలేని డిగ్రీ కాగితాన్ని చింపి ముక్కలు చేశాడు, తన మనసు లాగే. సమాజంమీద, మనుషులమీద, ప్రభుత్వంమీద కక్షపూనాడు, కత్తిగట్టాడు.

'ఉన్నవాడు లేని వాణ్ణి దోచుకుంటున్నాడు. లేనివాడు వున్నవాణ్ణి ఎందుకు దోచుకోకూడదు?' అనుకున్నాడు కసిగా, కోపంగా.

అందుకే దొంగతనానికి పూనుకున్నాడు శ్రీరాం. ఎక్కడో కత్తికూడా సంపాదించాడు.

** ** **

లక్ష్మయ్యశెట్టి బ్యాంకుల్ని నమ్మలేనట్టు ధనమంతా ఇంటిలో ఇనప్పెట్టెలోనే దాచుకుంటాడు. వడ్డీ వ్యాపారంచేసే శెట్టి పేదల్ని దోచుకుని ఊర్లో పెద్ద పెద్ద భవంతులను కట్టాడని చెప్పుకుంటారంతా.

ఆ రోజు రాత్రి ఎప్పటిలా ఇనప్పెట్టెలోని సొమ్ములన్నీ జాగ్రత్తగా లెక్క చూసుకుని నిద్రకు ఉపక్రమించాడు శెట్టి.

అర్ధరాత్రివేళ ఎందుకో హఠాత్తుగా మెలకువ వచ్చింది శెట్టికి. ఏదో అలికిడి వినిపించడంతో మెల్లగా పక్కమీంచి లేచాడు.

చప్పుడు ఇనప్పెట్టె దగ్గరనుంచి వస్తున్నట్టు అనిపించింది. చప్పుడు చేయకుండా వెళ్ళి లైటు వేశాడు.

ఎదుటి దృశ్యం చూసి అదిరిపడ్డాడు శెట్టి.

ఇనప్పెట్టె దగ్గర ఓ దొంగ నిలుచుని వున్నాడు!

ఆ దొంగ చేతిలో కత్తి వుంది.

అప్రయత్నంగా కిటికీవంక చూశాడు శెట్టి. అది తెరిచి వుంది.

దొంగను చూడగానే విపరీతంగా వణికిపోయాడు శెట్టి భయంతో.

దొంగలంటే చచ్చేంత భయం శెట్టికి. దానికితోడు అతని జీవితంలో దొంగను చూడడం అదే ప్రథమం!

అరవడానిక్కూడా ధైర్యం చాలలేదు శెట్టికి. నోరు విప్పితే దొంగ కత్తితో పొడిచేస్తాడేమోనన్న భయం!

'బాబ్బాబు! దొంగను చూడడం నాకిదే మొదటి సారి. నీకు కావలసింది తీసుకుపో. నన్ను మాత్రం ఏమీ చెయ్యకు!' అని దొంగతో చెప్పాలనిపించింది అతనికి. కాని, ఎంత ప్రయత్నించినా భయంతో నోరు పెకలలేదు. మనిషి ఆపాదమస్తకం కంపించిపోతున్నాడు.

అయితే—

దొంగ పనికూడా శెట్టికంటె ఏ మాత్రం మెరుగ్గా లేదు. ఏదో ఆవేశంలో దొంగతనానికి పూనుకున్నాడే కాని, బయలుదేరినప్పటి నుంచి 'గుండెల్లో దడగానే వుంది శ్రీరాంకి. ఎలాగో ఆ ఇంట్లో అయితే ప్రవేశించగలిగాడు కాని, అటుపైన ఏం చేయాలో తెలీలేదు.

ఇప్పుడు అనుకోకుండా శెట్టి లేచి కూర్చోవడమే కాకుండా, ఎదుట నిలుచోవడంతో భయవిహ్వాలుడయ్యాడు అతను. చేతిలోని కత్తి భూకంపం వచ్చినట్లు వణికిపోతోంది.

శెట్టి ఎక్కడ అరుస్తాడో, అందరూ వచ్చి తనను ఎక్కడ పట్టుకుంటారోనన్న భీతి నిలువెల్లా వణికించింది అతన్ని.

'బాబ్బాబు! దొంగతనం నాకు కొత్త. బుద్ధి గడ్డితిని వచ్చాను. అరవద్దు! ప్లీజ్!' అంటూ శెట్టితో ప్లీడ్ చేయాలనుకున్నాడు. కాని, పెదాలు సమ్మె చేశాయి.

ఓ క్షణంపాటు- శెట్టీ, శ్రీరామూ ఒకరిని చూసి ఒకరు వణికిపోయారు.

చూస్తూండగానే భయంతో తెలివితప్పి దబ్బున నేలమీద పడిపోయాడు లక్ష్మయ్యశెట్టి!

అదే సమయంలో వణుకుతున్న శ్రీరాం చేతిలోంచి కత్తి నేలకు జారిపోయింది.

ఒక్క గెంతులో కిటికీలోంచి బయటకు వురికి చీకట్లో అదృశ్యమయ్యాడు అతను!

## కాలమ్ దాటని కథ

సుబ్బారావుకు చాలా చికాకుగా వుంది. గత ఐదు సంవత్సరాలలో ఎన్నడూ భార్య మీద రాని అనుమానం గత ఐదు నెలలుగా పక్క పోర్షనులో వుంటున్న కుమార్‌ని చూసినప్పటి నుంచి పుట్టుకొచ్చి యమా స్పీడుతో పెరిగి పోతోంది. ఆ స్టూడెంటు వచ్చినప్పటి నుంచి తన భార్య అలంకరణ పెరగడం, మొహం ఆనందంతో వెలగడం, అతను తరచుగా రావడం సుబ్బారావు అనుమానానికి ముఖ్య కారణాలు. ఇంత కాలం పిల్లా జెల్లా లేని తమకు ''ఏమండీ! మీకు బాబు కావాలా? పాప కావాలా'' అని భార్య అడిగే సరికి సుబ్బారావుకు ఏడవాలో నవ్వాలో అర్థంకాకుండా పోయింది.

ఇల్లు మారదామని విశ్వప్రయత్నం చేశాడు. ఈ జంట నగరాలలో బస్సు మారకుండా ఆఫీసుకు చేరగలిగేది తనొక్కడే. అందుకని ఏమి చెయ్యడానికీ పాలు

### అయ్యో! అదీ సంగతి!



పోక ఓ రోజు ఫుల్‌గా మందుకొట్టి ఇంటికి వొచ్చాడు. లోపల కుమార్‌తో ''నువ్వెక్కడివీ భోజనానికి ఇబ్బంది పడుతున్నావు గదా! మా ఇంట్లో చేసెయ్య కూడదా'' అంటోంది భార్య. తాగింది మొత్తం తలకెక్కిన సుబ్బారావు అరవబోయాడు. ఈ లోపే ''అలాగే అక్కా! చాలా థాంక్స్'' అన్న ఆ కుర్రాడి మాట వినిపించింది. అంతే సుబ్బారావు మైకం మొత్తం దిగిపోయింది. సుబ్బారావు నిశ్చింతగా భోంచేసి వక్క పొడి వేసుకుని బయటకు వచ్చాడు. రిక్షా ఎక్కి ''సుధాఅపార్ట్‌మెంట్స్‌కి పోనీ'' అన్నాడు. అక్కడ వాళ్ళ ఆఫీసులోనే పని చేసే వరలక్ష్మి వుంటోంది. పాపం ఆమెకు మాత్రం ఎవరున్నారు. సుబ్బారావు తప్పు! అయ్యో! అదీ సంగతి!

ఎస్.పి.